# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-10-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ఈ రోజు తిరుపతిలో నిర్వహించే వారాహి బహిరంగ సభలో పాల్గొంటారు.**
2. **రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రధాన దేవాలయాల్లో దసరా ఉత్సవాలు ఈరోజు నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి.**
3. **ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాల పరిధిలో ఓటర్ల జాబితా సవరణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది.**
4. **రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఈరోజు గ్రామసభలు జరుగుతున్నాయి.**

=============================

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ఈ రోజు తిరుపతిలో నిర్వహించే వారాహి బహిరంగ సభలో పాల్గొంటారని జనసేన పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ రోజు సాయంత్రం తిరుపతిలోని జ్యోతిరావ్ పూలే సర్కిల్‌లో నిర్వహించే వారాహి బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని, సభలో పవన్ కల్యాణ్ వారాహి డిక్లరేషన్ ను ప్రజలకు వివరించనున్నారని జనసేన పార్టీ నాయకులు తెలిపారు.

---------------------------

దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా ఈరోజు శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో దర్శమిస్తున్న విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారిని రాష్ట్ర హోం శాఖ మంత్రి వి.అనిత, దేవాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్ధసారథి దర్శించుకున్నారు. దర్శన అనంతరం మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి మాట్లాడుతూ, శరన్నవరాత్రి మహోత్సవాలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, సులభంగా దర్శించుకునేలా ఐదు క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. రద్దీకి అనుగుణంగా ప్రతి ఒక్కరికి ప్రసాదాలు, అన్నప్రసాదాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రధాన దేవాలయాల్లో దసరా ఉత్సవాలు ఈరోజు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా అన్ని ఆలయాలలో భక్తుల కోసం ఆయా దేవస్థానాల అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మ వారు ఈరోజు బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిస్తుండగా, నంద్యాల జిల్లా శ్రీశైలం శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి

వారి ఆలయంలో శైల పుత్రిగా అమ్మవారు దర్శనమిస్తున్నారు. బృంగి వాహనంపై శ్రీ స్వామి., అమ్మవార్ల గ్రామోత్సవం ఈరోజు సాయంత్రం జరగనున్నది.

ఇదిలా ఉండగా ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల కుంకుళ్ళమ్మ ఆలయంలో బాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిస్తుండగా.. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం శ్రీ మావుళ్ళమ్మ ఆలయంలో శ్రీ సువర్ణ రజిత కవచ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు.

---------------------------

తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా జరిగే ధ్వజారోహణం కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఉండవల్లి నుంచి రేపు సాయంత్రం బయలుదేరి తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. అనంతరం తిరుమల చేరుకొని బేడి ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పిస్తారు. తర్వాత మాడవీధుల్లో జరిగే పెద్దశేష వాహన సేవలో పాల్గొంటారు. ఏల్లుండి తిరుమలలో నూతనంగా నిర్మించిన వకుళమాత నూతన కేంద్రీయ వంటశాలను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాల పరిధిలో ఓటర్ల జాబితా సవరణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాల పరిధిలో అర్హులైన పట్టభద్రులు నవంబరు 6 వరకు ఓటరుగా ఓటు నమోదు చేసుకునే అవకాశం కల్పించామని పేర్కొంది. అర్హుల నుంచి ఫారం-18 ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని నవంబరు 6 వరకు నమోదు ప్రక్రియ పూర్తి చేసి 23న ముసాయిదా జాబితా ప్రచురిస్తామని తెలిపింది. నవంబర్ 29 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని, డిసెంబరు 25 నాటికి అభ్యంతరాల పరిష్కారం పూర్తిచేసి 30న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తామని ఎన్నికల సంఘం తెలిపింది.

---------------------------

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ఈరోజు ఉదయం కుటుంబ సమేతంగా దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. దర్శనానంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో కేంద్రమంత్రికి వేద పండితులు వేద ఆశీర్వచనం అందించి స్వామివారి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం కేంద్రమంత్రి తిరుపతికి చేరుకుని తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఈరోజు గ్రామసభలు జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అన్ని గ్రామాల్లో గాంధీ జయంతి మొదలుకొని సుమారు 20 రోజుల పాటు గ్రామ సభలను నిర్వహిస్తారు. గ్రామ పంచాయతీల వద్ద అందుబాటులో ఉండే నిధులు, వాటితో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన బడ్జెట్ల రూపకల్పనపై ఈ గ్రామ సభల్లో చర్చించి నిర్ణయాలను తీసుకుంటారు. అలాగే పచ్చదనం పెంపుదల ఆవశ్యకత, పరిసరాల పరిశుభ్రతకు తీసుకున్న చర్యల గురించి తప్పనిసరిగా గ్రామస్థులకు వివరించాలని

ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రకారం క్షేత్రస్థాయిలో గ్రామసభలను అధికారులు నిర్వహిస్తున్నారు.

-------------------------

దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో రాష్ట్రంలో ఉన్న విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్ల పరిధిలోకి వచ్చే లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో..రైల్వే జోనల్ మేనేజర్ విజయవాడలో రేపు సమావేశం కానున్నారు. సమావేశంలో రాష్ట్రంలో చేపట్టాల్సిన రైల్వే లైన్ల నిర్మాణం, కొత్త ప్రాజెక్టులపై పార్లమెంట్ సభ్యులు ఇచ్చే ప్రతిపాదనలపై చర్చించనున్నారు. రాష్ట్రంలో కీలకమైన రైల్వే ప్రాజెక్టులు, విశాఖ కేంద్రంగా మంజూరైన కొత్త జోన్ కార్యాలయాల నిర్మాణం, రాజధాని అమరావతికి మంజూరైన కొత్త రైల్వే లైన్ వంటి అంశాలపై కూడా ఈ సమావేశంలో చర్చిస్తారని అధికారులు తెలిపారు.

-------------------------

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పెదబయలు మండలం లకేయిపుట్టు, అరకులోయ మండలం బొండాం పంచాయతీ మజ్జివలస, చింతపల్లిల్లో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలను ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఝార్ఖండ్ నుంచి దృశ్యమాధ్యమం ద్వారా నిన్న ప్రారంభించారు. దీనిపై మరిన్ని వివరాలను అల్లూరి సీతారామరాజు జిల్లా ఆకాశవాణి ప్రతినిధి పి. సూర్యారావు తెలియజేస్తూ...

వాయిస్ (34 సెకన్లు)

-------------------------

దేశ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం అమలులోకి వచ్చి ఆరేళ్ళు పూర్తయింది. దేశంలో కోట్లాదిమంది పేద కుటుంబాలకు ఆరోగ్య బీమా కల్పించేందుకు ఉద్దేశించిన ఈ ఆయుష్మాన్ భారత్ – ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన పథకాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 2018వ సంవత్సరం సెప్టెంబర్ 23వ తేదీన ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీ నగరంలో ప్రారంభించారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రభుత్వ ఆరోగ్య పథకంగా పేరు తెచ్చుకున్న ఆయుష్మాన్ భారత్ ఆరేళ్ళు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు ప్రసారమవుతుంది.

-------------------------

ప్రధానమంత్రి జన జాతీయ గ్రామ్ ఉన్నత్ అభియాన్ పథకం కింద విజయనగరం జిల్లాలో తొమ్మిది గ్రామాలను కేంద్రం ఎంపిక చేసిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. విజయనగరంలోని కలెక్టర్ కార్యాలయంలో జన జాతీయ గ్రామ్ ఉన్నత్ పథకంపై రూపొందించిన గోడపత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న అయిదేళ్లలో గిరిజనుల ఆర్థిక, సామాజిక అభ్యున్నతే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, ఆర్థిక సాధికారత , నాణ్యమైన విద్య, ఆరోగ్యకరమైన జీవనం వంటి అంశాలే ప్రాధాన్యతగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు.

-------------------------

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ నెల 10వ తేదీన మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సమావేశంలో చర్చించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాల్సిందిగా అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులను ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు. నిర్దేశిత నమూనాలో ప్రతిపాదనలను 8వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు సాధారణ పరిపాలన శాఖకు అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

=======================